# గురుకులంలో కరెంట్ షాక్

- నలుగురు బాలికలకు గాయాలు
- ప్రైవేట్ దవాఖానలో చికిత్స
- స్పోర్ట్స్ ఫ్లాగ్ ఏర్పాటు చేస్తుండగా ప్రమాదం
- పిల్లల ప్రాణాలు పోతున్నా పట్టదా?
- మాజీ మంత్రి హరీశ్ రావు మండిపాటు

మెదక్‌లోని దవాఖానలో గురుకుల విద్యార్థినిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్‌రూరల్, అక్టోబర్ 22 : మెదక్ జిల్లా హవేళీ ఘన్‌పూర్‌లోని మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో నలుగురు విద్యార్థినులు మంగళవారం కరెంట్ షాక్‌తో గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలలో ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం స్పోర్ట్స్ ఫ్లాగ్ రూపొందిస్తుండగా ఇనుప రాడ్ కరెంటు తీగలకు తగిలింది. రాడ్ పట్టుకున్న ఇంటర్ విద్యార్థిని రజిత, పదో తరగతి విద్యార్థినులు వసంత, అనుష్క, గాయత్రి చేతులకు షాక్ కొట్టింది. ప్రిన్సిపాల్ విజయ నిర్మల వారిని వెంటనే మెదక్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం మెదక్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పి చికిత్స చేయించారు. విషయం తెలిసి మెదక్ ఆర్డీవో రమాదేవి దవాఖానకు వెళ్లి విద్యార్థినులను పరామర్శించారు.

**విద్యార్థులతో పనులా: పద్మా దేవేందర్‌రెడ్డి**

విద్యార్థులను మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి హాస్పిటల్‌కు వెళ్లి పరామర్శించారు. ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. గురుకులం ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. ఏదైనా పని ఉంటే వర్కర్లను పెట్టి చేయించాలని, విద్యార్థులతో పని చేయించవద్దని సూచించారు.

షాద్‌నగర్– ఆమన్‌గల్ రూట్ బస్సులో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న విద్యార్థులు

# పిల్లల ప్రాణాలు పోతున్నా పట్టదా?

- సిబ్బంది నిర్లక్ష్యం గురుకుల విద్యార్థులకు శాపం
- కరెంట్ షాక్‌తో నలుగురు విద్యార్థులకు గాయాలవడం దురదృష్టకరం : హరీశ్

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): గురుకులాలపై ప్రభుత్వ పట్టింపులేనితనం పిల్లల ప్రాణాల మీదకు తెస్తున్నదని, ఓ వైపు విద్యార్థుల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు నిలదీశారు. కరెంటు షాక్ తగిలి నలుగురు గురుకుల విద్యార్థులకు గాయాలైన ఘటనపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సిబ్బంది నిర్లక్ష్యం గురుకుల విద్యార్థులకు శాపంగా మారుతున్నదని మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. 'మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ గురుకులానికి చెందిన నలుగురు విద్యార్థినులు కరెంట్ షాక్ తగిలి గాయాల పాలవడం దురదృష్టకరం. తక్షణం స్పందించి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి.. కాంగ్రెస్ పాలనలో గురుకులాల్లో పాము కాట్లు, కుక్క కాట్లు, ఎలుక కాట్లు, ఫుడ్ పాయిజన్ కేసులు సర్వసాధారణమయ్యాయి. ఇప్పుడు ఆ జాబితాలో కరెంట్ షాక్‌లు చేరాయి. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలి. గాడి తప్పిన గురుకులాలను బాగు చేయాలి' అని డిమాండ్ చేశారు.

**సజ్జనార్ సార్.. ఇటు చూడండి!**

విద్యార్థులు భుజాలకు బ్యాగులు వేసుకొని ఫుట్‌బోర్డులో ప్రమాదకరంగా వేలాడుతూ బస్సుల్లో ప్రయాణించడంపై హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. బస్సుల సంఖ్య పెంచి బడి పిల్లల ప్రాణాలు కాపాలని టీజీఎస్ఆర్టీసీ సీఎండీ వీసీ సజ్జనార్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు.

**రద్దీకి అనుగుణంగా బస్సులు : సజ్జనార్**

ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థుల ఫుట్‌బోర్డు ప్రయాణం వీడియోలపై సంస్థ ఎండీ సజ్జనార్ స్పందించారు. ఇలాంటి దృశ్యాలు సోషల్ మీడియా ద్వారా తమ దృష్టికి వచ్చాయని పేర్కొన్నారు. రోజూ ఉదయం, సాయంత్రం బస్సుల్లో రద్దీ ఎక్కువ ఉంటున్నదని తెలిపారు. రద్దీకి అనుగుణంగా బస్సులు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. కొన్ని రూట్లలో విద్యార్థుల రద్దీ విపరీతంగా ఉంటున్న విషయం తమ దృష్టికి వచ్చిందని వివరించారు. బస్సులు పెంచే అంశంపై చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

## ఎన్ఐసీ చేతికి 'ధరణి'

**డిసెంబర్ 1 నుంచి నిర్వహణ బాధ్యతలు**

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ) : ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్(ఎన్ఐసీ)కి అప్పగించింది. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. పోర్టల్ ప్రారంభం నుంచి టెర్రాసిస్ కంపెనీ నిర్వహణ బాధ్యతలను చూస్తున్నది. మొదట ప్రభుత్వం మూడేండ్ల ఒప్పందం కుదుర్చుకోగా, ఆ తర్వాత మరో రెండేండ్లు, తాజాగా నవంబర్ 30 వరకు గడువు పొడిగించింది. దీనిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందిస్తూ.. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పోర్టల్ నిర్వహణను విదేశీ సంస్థ నుంచి స్వదేశీ సంస్థకు అప్పగించినట్టు చెప్పారు. పోర్టల్ నిర్వహణ బాధ్యతల బదలాయింపుపై చర్చించేందుకు 25న సచివాలయంలో సమావేశం నిర్వహించనున్నట్టు రెవెన్యూ శాఖ తెలిపింది.

## ఒక్కరి కోసం 12 మంది బదిలీ?

**బదిలీ వ్యవహారంలో ఓ మంత్రి కుమారుడి పాత్ర**

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ) : స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో ఇటీవల జరిగిన సబ్ రిజిస్ట్రార్ల బదిలీలపై జోరుగా చర్చలు జరుగుతున్నాయి. తమకు అనుకూలమైన ఒక సబ్ రిజిస్ట్రార్‌కు అనుకున్న చోట పోస్టింగ్ ఇప్పించుకునేందుకు 12 మందిని బదిలీ చేశారని విమర్శలున్నాయి. ఓ మంత్రి కొడుకు ఈ వ్యవహారంలో చక్రం తిప్పినట్టు ఆరోపణలున్నాయి. దీర్ఘకాలంగా ఒకేచోట పనిచేసిన సబ్ రిజిస్ట్రార్లను అసెంబ్లీ ఎన్నికల ముందు ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. ఇందులో రంగారెడ్డికి చెందిన ఓ సబ్ రిజిస్ట్రార్ కూడా బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఆయన అక్కడే ఉన్నారని, ఆదాయం పడిపోవడంతో తిరిగి రంగారెడ్డి జిల్లాకు వచ్చేందుకు విశ్వప్రయత్నాలు చేశారని తెలుస్తున్నది. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదని సమాచారం. దీంతో ఇక లాభం లేదనుకొని తన స్నేహితుడైన ఓ మంత్రి కుమారుడిని సంప్రదించినట్టు తెలిసింది. గతంలో సదరు మంత్రి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆయన, ఆయన కుమారుడు కొనుగోలు చేసిన అక్రమ ఆస్తులను బినామీలపై ఎలా రిజిస్ట్రేషన్ చేయాలో, తిరిగి వాటిని ఎలా అమ్మాలో సదరు సబ్ రిజిస్ట్రార్ సలహాలు ఇచ్చినట్టు చర్చ జరుగుతున్నది. మంత్రి కొడుకు ఒత్తిడి చేయడంతో.. ఒక్కరినే బదిలీ చేయడం సాధ్యం కాదని ఉన్నతాధికారులు తేల్చి చెప్పారని సమాచారం. దీంతో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల పరిధిలోని ఆరోపణలున్న సబ్ రిజిస్ట్రార్ల జాబితా సిద్ధం చేయించారని తెలిసింది. ఏ చిన్న ఆరోపణ ఉన్నా బదిలీ చేయాలని ఆదేశాలు ఇచ్చారని, దీంతో ఒక్కరి కోసం 12 మందికి స్థాన చలనం జరిగిందని చెప్పుకుంటున్నారు.

## రవాణాశాఖలో 56 మంది డీబీఏల తొలగింపు

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ) : రవాణాశాఖలో వాహనాలకు ఫ్యాన్సీ నంబర్ల కేటాయింపు, లావాదేవీల్లో జరిగిన అక్రమాలపై డాటాబేస్ ఆపరేటర్లు, అసిస్టెంట్ల(డీబీఏ)పై రవాణాశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 56 మంది డేటాబేస్ ఆపరేటర్లు, అసిస్టెంట్లను మంగళవా రం రవాణాశాఖ విధుల నుంచి తొలగించింది. డీబీఏలు దొడ్డిదారిన ఫ్యాన్సీ నంబర్లను కేటాయించడం, అధికారులకు తెలియకుండా లావాదేవీలు జరిపినట్టు ఫిర్యాదులందాయి. దీనిపై దృష్టి సారించిన ఉన్నతాధికారులు క్షేత్రాస్థాయిలో విచారణ జరి పి, 56 మంది డీబీఏలు అడ్డదారిన డబ్బులు సంపాదించినట్లు గుర్తించా రు. ఈ వ్యవహారంలో కీలక పాత్రధారులను వదిలేసి కేవలం డీబీఏలను విధుల్లోంచి తొలగించడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో గతంలో పనిచేసిన ఓ ఉన్నతాధికారి పాత్ర ఉన్నట్టు ప్రభుత్వం గుర్తించింది.

# ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అనుచరుడి హత్య

- మాజీ ఎంపీటీసీ మారు గంగారెడ్డిని కారుతో ఢీకొట్టి, కత్తితో పొడిచిన దుండగుడు
- హోటల్‌లో టిఫిన్ చేసి వస్తుండగా దాడి
- జగిత్యాల జిల్లా జాబితాపూర్‌లో ఘటన
- పాతకక్షలే కారణమంటున్న గ్రామస్థులు
- హత్యను నిరసిస్తూ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ శ్రేణుల ధర్నా
- నాలుగు గంటల పాటు రోడ్డుపై బైఠాయింపు

జాబితాపూర్‌లోని హత్యా స్థలంలో రక్తం మడుగులో పడి ఉన్న గంగారెడ్డి


గంగారెడ్డి (ఫైల్)

జగిత్యాల/ జగిత్యాల రూరల్, అక్టోబర్ 22 : ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రధాన అనుచరుడు, జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు మారు గంగారెడ్డి(58) మంగళవారం ఉదయం దారుణహత్యకు గురయ్యాడు. స్థానికులు, జగిత్యాల రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగారెడ్డి ఉదయం ద్విచక్రవాహనంపై రోజులానే గ్రామంలోని హోటల్‌లో టిఫిన్ చేసి తిరిగి ఇంటికి వెళ్తుండగా గుర్తు తెలియని దుండగుడు కారుతో ఢీకొట్టాడు. కారులోంచి దిగి గంగారెడ్డి ఛాతి, మెడపై కత్తితో దాడిచేశాడు. ఆ తర్వాత కారును అక్కడే వదిలిపెట్టి వెళ్లిపోయాడు. నాలుగు అడుగుల దూరం వెళ్లి మరో కారులో ఎక్కి పారిపోయాడు. తీవ్ర రక్తస్రావంతో గంగారెడ్డి పడిపోవడాన్ని చూసిన స్థానికులు జిల్లా కేంద్రంలోని ప్రధాన దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోయాడు.

**పాత కక్షలే కారణమా?**

గంగారెడ్డి హత్యకు పాత కక్షలే కారణమన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలో గంగారెడ్డికి కొందరితో కొంత కాలంగా వైరం ఉన్నదని, ఈ క్రమంలోనే అతడిని హత్యచేసి ఉంటారని గ్రామస్థులు చెప్తున్నారు. గంగారెడ్డికి, అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి మధ్య భూమి వివాదం ఉన్నదని, ఈ విషయంలో పలుసార్లు ఇద్దరి మధ్య గొడవలు జరిగినట్టు తెలిసింది. భూ వివాదం ఉన్న వ్యక్తి తమ్ముడి కొడుకుపై గతంలో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు కాగా దీని వెనుక గంగారెడ్డి హస్తం ఉన్నదన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలోనే కక్ష పెంచుకున్న నిందితుడు గంగారెడ్డిని 'నీ చావు ఏనాటికైనా నా చేతిలోనే ఉన్నది' అని బెదిరించినట్టు గ్రామస్థులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలోనే హత్య జరిగి ఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**కాంగ్రెస్ శ్రేణులతో కలిసి జీవన్‌రెడ్డి ధర్నా**

గంగారెడ్డి హత్య విషయం తెలియగానే ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి పాతబస్టాండ్ సమీపంలోని జిల్లా ప్రధాన దవాఖానకు చేరుకున్నారు. విగత జీవిగా పడి ఉన్న తన ప్రధాన అనుచరుడిని చూసి చలించిపోయి కన్నీటిపర్యంతమయ్యారు. గంగారెడ్డి హత్య విషయం జగిత్యాలతోపాటు, చుట్టుపక్కల గ్రామాలకు దావనలంలా వ్యాపించడంతో కొద్ది సేపట్లోనే పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు దవాఖానకు తరలివచ్చారు. రాజకీయ కక్షతోనే హత్య జరిగిందని భావించి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నేతృత్వంలో పాతబస్టాండ్ వద్ద 563వ జాతీయ రహదారిపై పెద్దఎత్తున రాస్తారోకో చేశారు. కొన్ని రోజుల నుంచి జాబితాపూర్‌కు చెందిన బత్తిని సంతోష్ అనే యువకుడు గంగారెడ్డిని చంపుతానని సెల్‌ఫోన్‌లో బెదిరిస్తున్నాడని, అతడే హత్యచేశాడని గ్రామస్థులు చెప్పడంతో ఆగ్రహానికి లోనయ్యారు. బెదిరింపుల విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, వారి నిర్లక్ష్యం వల్లే గంగారెడ్డి హత్యకు గురయ్యాడంటూ మండిపడ్డారు. నిందితుడికి కాంగ్రెస్‌లో ఇటీవల చేరిన ఎమ్మెల్యేతో సన్నిహిత సంబంధాలున్నాయని, పోలీసులతో సైతం సత్సంబంధాలు ఉండడం వల్లే రాజకీయ కక్షతోనే ఈ హత్య జరిగిందని ఆరోపించారు.

## జీవో 46 రద్దు హామీ ఏమైంది?

- జీవో రద్దు ఆందోళనలకు నాడు కాంగ్రెస్ దరఖాస్తు
- అధికారంలోకి వచ్చాక పట్టించుకోవట్లేదని ఆగ్రహం
- నేడు గాంధీభవన్ ముట్టడికి బాధితుల పిలుపు

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): 'అధికారంలోకి వస్తే.. జీవో 46ను రద్దు చేస్తాం' ఇది అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ.. ఇప్పుడు ఆ పార్టీ అధికారంలోకి వచ్చి 10 నెలలు దాటింది. ఆ హామీపై నేటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయింది. దీంతో బాధితులు భగ్గుమంటున్నారు. నాడు జీవో 46 బాధితులను రెచ్చగొట్టి, బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు, ఆందోళనలు చేయించిన ఫొటోలు, ఆందోళనల దరఖాస్తులు ఇప్పుడు బయటికి వచ్చాయి. వాటి ప్రకారం 2023 జూలై 19న ఇందిరా పార్క్‌లో జరిగే జీవో 46 బాధితుల ధర్నాకు అనుమతి ఇవ్వాలని నాటి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సిటీ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆ ఆందోళనలు నాటి టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, ప్రస్తుత ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జీవో 46ను రద్దు చేయాలని భారీగా ఆందోళనలు, ధర్నాలు చేపట్టారు. పాల్గొన్న పలువురిపై కేసులు కూనమోదయ్యాయి. అధికారంలోకి వచ్చాక ఆ కేసులనూ మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు రద్దు కూడా చేయకపోవడం దారుణమని బాధితులు వాపోతున్నారు.

**అతీగతి లేని క్యాబినెట్ సబ్ కమిటీ**

46 జీవో రద్దు గురించి రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీ వేసి నెలలు గడుస్తున్నా నేటికీ అతీగతి లేదని బాధితులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్ మోసపూరిత కుట్రను నిలదీసేందుకు బుధవారం జీవో 46 బాధితులంతా ఐక్యంగా కదిలివచ్చి గాంధీభవన్‌ను ముట్టడించనున్నట్టు పలువురు తెలిపారు. క్యాబినెట్ సబ్ కమిటీలో ఉన్న మంత్రి శ్రీధర్‌బాబు గాంధీభవన్‌లో బుధవారం నిర్వహించే ప్రజావాణికి తామంతా హాజరవుతామని తెలిపారు. న్యాయం చేయకపోతే నిరాహార దీక్షలకు దిగుతామని హెచ్చరించారు.

# ఏది శాంతి? భద్రత ఎక్కడ?

మొదటిపేజీ తరువాయి...

మంగళవారం జిల్లా దవాఖానలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేండ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందని, కానీ, ఫిరాయింపుల వారిలో తీవ్ర మనోవేదన మిగిలించాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతి పార్టీకి నియమావళి ఉంటుందని, నైతిక విలువలు ఉంటాయని, అధికారం కంటే నైతిక విలువలే ముఖ్యమని స్పష్టం చేశారు. 1984లో రాజీవ్‌గాంధీ ప్రధాని అయ్యాక రాజకీయాల్లో నైతిక విలువల కోసం పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని అమల్లోకి తెచ్చారని గుర్తుచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు సంపూర్ణ మెజార్టీ ఉన్నా ఫిరాయింపులను ఎందుకు ప్రోత్సహిస్తున్నారో అర్థం కావడం లేదని మండిపడ్డారు. మూడు మాసాలుగా మానసికంగా తీవ్రంగా కుంగిపోయానని, 40 ఏండ్లు పార్టీ కోసం పనిచేసిన తనలాంటి వారికి ఇప్పుడు పార్టీలో స్థానం ఎక్కడ ఉన్నదో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. పదేండ్లు బీఆర్ఎస్‌లో అధికారం అనుభవించినవారు కాంగ్రెస్‌లో చేరారని, కాంగ్రెస్ ముసుగులో కాంగ్రెస్ కార్యకర్తలను, నాయకులను హత్యలు చేయించడం అత్యంత బాధాకరమని వాపోయారు.

జగిత్యాల పాతబస్టాండ్ వద్ద రాస్తారోకోలో విప్ లక్ష్మణ్‌కుమార్‌తో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

**మమ్మల్ని బతుకనీయండి.. విప్‌పై జీవన్‌రెడ్డి ఫైర్**

ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. గంగారెడ్డి హత్య ఉదయం ఆరున్నర గంటల ప్రాంతంలో జరగ్గా, విషయాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విప్ లక్ష్మణ్‌కుమార్‌కు ఫోన్‌లో తెలిపారు. ఆయన 12గంటల ప్రాంతంలో ధర్నా వద్దకు రాగానే కార్యకర్తలు ఘెరావ్ చేశారు. గంగారెడ్డి హత్యకు ఎవరు బాధ్యులు? అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ నుంచి వచ్చి కాంగ్రెస్ ముసుగు తొడుక్కునవారే హత్య చేయించారని ఆరోపించారు. తీవ్ర అసహనానికి లోనైన జీవన్‌రెడ్డి 'కార్యకర్త హత్యకు గురయ్యాడని ఉదయం 7 గంటలకు చెప్తే.. ఇప్పుడా వచ్చేది' అంటూ నేరుగా విప్ ముందే ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్పీ అశోక్‌కుమార్ చేరుకొని సర్దిచెప్పే ప్రయత్నం చేయగా రెండు చేతులూ జోడించి, 'సార్.. దయచేసి మీ వల్ల ఏం కాదు.. మీరు వెళ్లిపోండి.. మీవారి వల్లే ఇలా జరిగింది..' అంటూ ఎస్పీతో జీవన్‌రెడ్డి వాదించారు. రాష్ట్రంలో అసలు లా అండ్ ఆర్డర్ ఉన్నదా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో విప్ లక్ష్మణ్‌కుమార్ కలుగుజేసుకునేందుకు యత్నించగా, 'బాబూ.. నీకో దండం.. నీ పార్టీకో దండం.. మమల్ని బతుకనివ్వండి' అంటూ ఎమ్మెల్సీ దండంపెట్టి మరీ మండిపడ్డారు. 'పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి ఇలాంటి ఘటనలు జరిగేందుకు కారణమవుతున్నారు. ఇన్నాళ్లూ ఎవరి మీద పోరాటం చేశామో వారి చేతుల్లో ఇప్పుడు చంపబడుతున్నాం. ఏకంగా మమ్మల్ని ఇప్పుడు భౌతికంగా లేకుండా చేయాలని చూస్తున్నారు.. నా అనుకున్నవాళ్లకు అవసరమైతే ఎన్‌జీవో పెట్టుకొని సేవచేస్తా.. అంతేగాని అనుచరులను, అయినోళ్లను పోగొట్టుకోలేను' అంటూ జీవన్‌రెడ్డి ఆగ్రహంతో ఊగిపోయారు.

**మీ బొంద తీసుకుంటరు..**

రంగారెడ్డి తనకు తమ్ముడిలాంటి వాడని, 30 ఏండ్లుగా తనవెంట ఉన్నాడని, పోలీసుల నిర్లక్ష్యం వల్లే హత్యకు గురయ్యాడని, ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని పోలీసులపైకి జీవన్‌రెడ్డి ఫైర్ అయ్యారు. గంగారెడ్డిని చంపుతానని బత్తిని సంతోష్ అనే వ్యక్తి బెదిరించాడని, ఈ విషయంపై ఫిర్యాదు చేసినా ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. బతుకమ్మ పండుగ రోజు నిందితుడు డీజేను పగులగొట్టాడని, దసరా పండుగ రోజు గంగారెడ్డిపై దౌర్జన్యం చేశాడని ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం ఏమిటని మండిపడ్డారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఎమ్మెల్సీని సముదాయిస్తూ చర్యలు తీసుకుంటామని చెప్పగా, 'మీ బొంద తీసుకుంటారు.. ఏం చర్యలు తీసుకుంటారు.. చచ్చాక తీసుకుంటరా? మీ ఎస్ఐ కాల్ రికార్డులు తీయండి.. హంతకుడికి, ఎస్ఐకి సంబంధం ఉన్నదా? లేదా? తెలుస్తుంది.. ఎన్నిమార్లు మాట్లాడుకున్నది తెలుస్తుంది' అంటూ జీవన్‌రెడ్డి ఫైర్ అయ్యారు. '20 కేసులు ఉన్నవాడితో పోలీసులకు స్నేహం ఏంటి' అని నిలదీశారు.

## కాంగ్రెస్‌లో కొనసాగలేను : పీసీసీ చీఫ్‌తో జీవన్‌రెడ్డి

గంగారెడ్డి మృతదేహానికి జగిత్యాల దవాఖానలో పోస్టుమార్టం నిర్వహిస్తున్న సమయంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, విప్ లక్ష్మణ్ కుమార్ అక్కడే ఉన్నారు. అదే సమయంలో టీ పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఎమ్మెల్సీకి ఫోన్ చేసి మాట్లాడారు. 'నా వాళ్లను చంపుతున్నారు.. నన్ను, కార్యకర్తలను అవమానిస్తున్నారు.. ఇక కాంగ్రెస్ పార్టీలో కొనసాగలేను, మా బతుకులు మమల్ని బతుకనివ్వండి. కాంగ్రెస్ పార్టీకి 40 ఏండ్లుగా సేవ చేస్తున్నందుకు నాకు మంచి బహుమతి ఇచ్చిండ్రు' అంటూ జీవన్‌రెడ్డి మండిపడ్డారు. పీసీసీ అధ్యక్షుడు ఫోన్‌లో మాట్లాడుతుండగానే, జీవన్‌రెడ్డి ఆవేశంతో ఫోన్ కట్‌చేసి విసిరికొట్టారు.

## ఇంకెక్కడి పార్టీ.. గంగల పార్టీ

కాంగ్రెస్ రాజ్యంలోనే కాంగ్రెస్ కార్యకర్తలు చచ్చిపోతున్నారని, పార్టీయే చంపుతున్నదని జీవన్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ఓ సందర్భంలో కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ అని వ్యాఖ్యానించగా, 'ఇంకెక్కడి పార్టీ గంగల పార్టీ' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. చివరికి పోలీసులు ఎమ్మెల్సీకి నచ్చచెప్పి ధర్నాను విరమింపజేశారు. నిందితులపై, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించి జీవన్‌రెడ్డి దవాఖానకు వెళ్లిపోయారు.

## రంగారెడ్డి అదనపు కలెక్టర్‌పై ఏసీబీ కేసు

- ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్టు నిర్ధారించిన ఏసీబీ
- 5.05 కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నట్టు గుర్తింపు
- రెండు నెలల క్రితం లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ భూపాల్ రెడ్డి



రంగారెడ్డి, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా అదనపు (రెవెన్యూ) కలెక్టర్ భూపాల్‌రెడ్డికి ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్టు గుర్తించారు. ఈయన ఆగస్టు 13న లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ విషయం తెలిసిందే. భూపాల్‌రెడ్డి సంబంధీకుల ఇళ్లల్లో ఏసీబీ మంగళవారం విస్తృత సోదాలు నిర్వహించింది. ఆయన బంధువుల ఇళ్లతోపాటు నాలుగు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి, రూ.5.05 కోట్ల విలువైన స్థిర, చర ఆస్తులను గుర్తించారు. అయితే రూ.4.19 కోట్ల విలువైన ఆస్తులు బినామీల పేరు మీద ఉన్నట్టు నిర్ధారించారు. ఈ ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్లో చాలా ఎక్కువగానే ఉంటుందని ఏసీబీ అంచనా వేసింది. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉండటంతో భూపాల్‌రెడ్డిపై ఏసీబీ కేసు నమోదు చేసింది. లంచం తీసుకుంటూ ఆగస్టు 13న భూపాల్‌రెడ్డి ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ధరణి పోర్టల్‌లో ప్రొహిబిటెడ్ జాబితా నుంచి 14 గుంటల భూమిని తొలగించాలంటూ ముత్యంరెడ్డి అనే వ్యక్తి దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకుగాను రూ.8 లక్షలు డిమాండ్ చేయగా.. సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డి ద్వారా లంచం తీసుకుంటుండగా భూపాల్ రెడ్డిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అప్పట్లో భూపాల్‌రెడ్డితోపాటు సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డిను అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు కోర్టులో హాజరుపర్చగా.. ఇద్దరూ జైలుకు వెళ్లారు.

## ఏసీబీకి చిక్కిన మున్సిపల్ కమిషనర్

- బిల్లులు చేసేందుకు రూ.20 వేలు డిమాండ్

పెబ్బేరు, అక్టోబర్ 22 : లంచం తీసుకుంటూ వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ మహబూబ్‌నగర్ రేంజ్ ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ కథనం మేరకు.. గతేడాది పెబ్బేరులోని పలు వార్డుల్లో తాను చేసిన సీసీ రోడ్లు, పెయింటింగ్ పనులకు బిల్లులు చేయాలని కాంట్రాక్టర్.. మున్సిపల్ కమిషనర్ ఆదిశేషును కలిసి విజ్ఞప్తి చేశారు. ఒక్కో పనికి రూ.83,930 చొప్పున మూడు పనులకుగాను బిల్లులు ఇవ్వాలని కోరగా.. రూ.25 వేల లంచం ఇవ్వాలని కమిషనర్ డిమాండ్ చేయగా రూ.20 వేలకు ఒప్పందం కుదిరింది. మంగళవారం ఆదిశేషు సదరు కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ దాడులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కమిషనర్ నుంచి డబ్బు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ తెలిపారు. ఇదే సమయంలో హైదరాబాద్‌లోని కమిషనర్ ఇంట్లోనూ ఏసీబీ అధికారులు సోదాలు చేశారు.

# కాంగ్రెస్ సర్కారుపై ఉద్యోగుల జంగ్

- ప్రభుత్వంపై సమరశంఖం పూరించిన ఉద్యోగులు
- ఈనెల 28వ తేదీ నుంచి జనవరి 30 వరకు పోరుబాట
- కార్యాచరణను ప్రకటించిన ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు
- జనవరిలోగా 50 అంశాలను పరిష్కరించాలని అల్టిమేటం
- జనవరి తర్వాత ఉధృతం
- పెన్‌డౌన్‌కు సన్నద్ధం


నాంపల్లిలోని టీఎన్జీవోభవన్‌లో కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న జేఏసీ ఉద్యోగులు

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ సర్కారుపపై ఉద్యోగులు జంగ్‌కు పిలుపునిచ్చారు. తమ సమస్యలు, డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమైంది. హక్కుల సాధన, డిమాండ్ల పరిష్కారానికి ఈ నెల 28 నుంచి జనవరి 30 వరకు పోరుబాట పట్టనున్నట్టు వెల్లడించింది. అక్టోబర్ 23 నుంచి జనవరి 30 వరకు జేఏసీ ఉద్యమ కార్యాచరణను ప్రకటించింది. మొత్తంగా నాలుగు నెలల పాటు సర్కారుపై దశలవారీగా ఉద్యమించనున్నట్టు తెలిపింది. ఈ నెల 26న జరిగే క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించి పరిష్కరించాలని, తమను చర్చలకు పిలవాలని లేదంటే మరో ఉద్యమం తప్పదని జేఏసీ నేతలు అల్టిమేటం జారీచేశారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్‌కు సంబంధించిన సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం కాకపోవడంతో విసిగివేసారిన ఉద్యోగులు సమరశంఖం పూరించారు. జేఏసీ జెండా కింద పోరాటానికి సిద్ధమయ్యారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశాన్ని మంగళవారం నాంపల్లిలోని టీఎన్జీవోభవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేసిన జేఏసీ నేతలు, అనంతరం పోరాటాలే శరణ్యమని తేల్చి, ఉద్యమ కార్యాచరణను ఖరారుచేశారు. అనంతరం టీఎన్జీవో భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ఉద్యోగుల జేఏసీ కార్యాచరణను ప్రకటించారు. 206 సంఘాలతో కూడిన జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే పోరాటంలో రాష్ట్రంలో ఉద్యోగులంతా భాగస్వామ్యం కావాలని వారు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రకటించిన 6 హామీలు, ఉద్యోగులకు సంబంధించిన 46 డిమాండ్లు మొత్తంగా 50 డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని అల్టిమేటం జారీచేశారు. జనవరి తర్వాత కూడా డిమాండ్లను పరిష్కరించకపోతే, చర్చలకు ఆహ్వానించకపోతే పెన్‌డౌన్ సహా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని జేఏసీ నేతలు హెచ్చరించారు. జేఏసీ నాయకులు ఎస్ఎం ముజీబీ హుస్సేనీ (టీఎన్జీవో), ఏ సత్యనారాయణ (టీజీవో), దామోదర్‌రెడ్డి (పీఆర్టీయూ టీఎస్), సదానందంగౌడ్ (ఎస్టీయూ), డాక్టర్ పీ మధుసూదన్ రెడ్డి (ఇంటర్ విద్యా జేఏసీ), రవీందర్‌రెడ్డి (ట్రెసా), పర్వతి సత్యనారాయణ (పీఆర్టీయూ తెలంగాణ) సహ ఇతర సంఘాల నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

**ఉద్యోగుల జేఏసీ కార్యాచరణ**

- 23 నుంచి 30 వరకు జిల్లా జేఏసీల ఏర్పాటు
- 28న రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో సీఎం, సీఎస్‌లకు కార్యాచరణ లేఖ అందజేత
- నవంబర్ 2న జిల్లా జేఏసీల ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు, కలెక్టర్లకు కార్యాచరణ లేఖల అందజేత
- నవంబర్ 4,5 తేదీల్లో జిల్లాల్లో ర్యాలీలు, ప్రజాప్రతినిధులకు వినతపత్రాల సమర్పణ
- నవంబర్ 7 నుంచి డిసెంబర్ 27 వరకు ఉమ్మడి పది జిల్లాల్లో ఉద్యోగుల సమస్యల సాధన సదస్సులు
- జనవరి 3,4 తేదీల్లో నల్లబ్యాడ్జీలు ధరించి, మధ్యాహ్న భోజన సమయంలో నిరసనలు
- జనవరి 21న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో మౌన ప్రదర్శనలు
- జనవరి 23న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బైక్ ర్యాలీలు
- జనవరి 30న జిల్లాలు, రాష్ట్ర రాజధానిలో మానవహారాలు

**ఉద్యోగులకు గౌరవంలేదు**

మా డిమాండ్ల సాధనకు మేం ఎక్కని ఆఫీసులేదు. తొక్కని గడపలేదు. ప్రభుత్వాన్ని కలిసేందుకు మాకు అపాయింట్‌మెంట్ ఇవ్వడంలేదు. మమ్మల్ని చర్చలకు ఆహ్వానించలేదు. అసలి రాష్ట్రంలో ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలకు గౌరవమే ఇవ్వడంలేదు. సంఘాలకు ప్రభుత్వ గుర్తింపునివ్వడంలేదు. సీఎం రేవంత్ చొరవ తీసుకుని, మమ్మల్ని చర్చలకు ఆహ్వానించాలి. 26న జరిగే మంత్రివర్గ సమావేశంలో మా సమస్యలపై చర్చించి పరిష్కరించాలి.

– మారం జగదీశ్వర్, జేఏసీ చైర్మన్

**తప్పనిసరి పరిస్థితుల్లోనే ఉద్యమ కార్యాచరణ**

గతంలో ఒక డీఏ పెండింగ్‌లో ఉంటేనే సమ్మెకు దిగిన సందర్భాలు ఉన్నాయి. ఐదు డీఏలు కలిపితే 17.21% పెండింగ్‌లో ఉంది. పీఆర్సీ 18 నెలలు ఆలస్యమైంది. ఉద్యోగుల నుంచి తీవ్ర ఒత్తిడి ఉంది. అయినా మేం ఇన్నాళ్లు ఓపికపట్టాం. మాపై భౌతికదాడులకు దిగుతామని మా ఉద్యోగులే హెచ్చరిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే మేం ఉద్యమ కార్యాచరణను ప్రకటిం చాం. జనవరి తర్వాత డిమాండ్లు పరిష్కారం కాకపోతే మరో కార్యాచరణను ప్రకటిస్తాం.

– ఏలూరి శ్రీనివాసరావు, జేఏసీ సెక్రటరీ జనరల్